క్లుప్తంగా

నేడు ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డికి సన్మానం

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని సింగారం చౌరస్తా సమీపంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 11గంటలకు స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికైన నవీన్ కుమార్‌రెడ్డి విజయోత్సవ సన్మాన సభను ఏర్పాటు చేయడం జరిగిందని బీఆర్‌ఎస్ పట్టణ, మండల అధ్యక్షుడు విజయ్‌సాగర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మరికల్: జిల్లా కేంద్రంలోని నిర్వహించే నూతనంగా ఎన్నికైన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డికి ఆదివారం చేసే సన్మాన సభను జయప్రదం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో అన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్. రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సభకు మండలం నుంచి అధికంగా పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

వర్షం కోసం పూజలు



మరికల్: వరుణ దేవుడు కరుణించాలని శనివారం మండలంలోని రైతులు కృష్ణానది నీటితో దేవతలకు అభిషేకం చేశారు. అంతకు ముందు స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసి కృష్ణానది నీళ్లకు తరలివెళ్లారు. అక్కడ కృష్ణానదికి ప్రత్యేక పూజలు చేసి బిందెలో నీటిని తెచ్చారు. అనంతరం వర్షం కురవాలని దేవతలను వేడుకున్నారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రేపు సైక్లింగ్ పోటీలు ప్రారంభం

మాగనూర్: మండలంలోని నేరడుగంలో వచ్చే నెల 1న సైక్లింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గోపాలం తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఐదు కిలో మీటర్లు సైక్లింగ్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 12 నుంచి 15 సంవత్సరాల మధ్య గల బాలుర మాత్రమే నిర్వహించి గెలుపొందిన వారికి జూలై 3, 4 తేదీలో హైదరాబాద్‌లో ఉస్మానియా యూనివర్సిటీ సైక్లింగ్ అకాడమీలో ప్రవేశంకోసం జరిగే ఎంపిక సైక్లింగ్ పోటీలకు పంపుతామన్నారు. ఈ పోటీలకు కృష్ణా, మాగనూర్ మండలాలకు చెందిన బాలుర మాత్రమే హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో అంబ్రేష్, రమేష్, దామోదర్ పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



మక్తల్: నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు సందర్భంగా శనివారం పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేక్‌కట్ చేసి బాలకృష్ణారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గణేష్‌కుమార్, నాగిరెడ్డి, రాంరెడ్డి, చంపూర్ రాములు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా విధులు

- మధ్యాహ్నం ఒంటి గంటకే బడికి తాళం
- విద్యార్థులు ఇంటిముఖం



మక్తల్: మధ్యాహ్నం ఒంటి గంటకే పాఠశాలకు తాళం వేసి ఉపాధ్యాయులు వెళ్లిపోయిన ఘటన మండలంలోని కాట్రేవ్‌పల్లిలో శనివారం చోటుచేసుకుంది. కాట్రేవ్‌పల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 200మంది విద్యార్థులు ఉండగా.. ఏడుగురు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. అయితే, శనివారం ఓ ఎంఈఓ పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఆ కార్యక్రమానికి హాజరయ్యేందుకుగాను ఉపాధ్యాయులు ఉదయం హాజరు వేసి మధ్యాహ్నం దుమ్మా కొట్టారు. మధ్యాహ్నం 12:30 గంటలకు విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసిన అనంతరం విద్యార్థులను ఇళ్లకు పంపించినట్లు తెలిసింది. ఈ విషయంపై హెచ్ఎం నర్సిరెడ్డిని వివరణ కోరగా.. ఇన్‌చార్జి ఎంఈఓ వెంకటయ్య పదవి విరమణ సందర్భంగా కలిసి వెళ్లామని, పాఠశాలకు తాళం వేసినట్లు తెలిపారు. డీఈఓ అబ్దుల్ ఘనీని వివరణ కోరగా.. కాట్రేవ్‌పల్లిలో పాఠశాలకు అనాధికారంగా సెలవుపై వెళ్లిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

నారాయణపేట రూరల్: అధికారులు తమకు కేటాయించిన గ్రామాలకు తప్పకుండా వెళ్లి వీలైనన్ని సమస్యలను అక్కడే పరిష్కరించాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మండలంలోని ఎంపీటీసీ సభ్యులు సభలో ప్రస్తావించిన ప్రతీ సమస్యను విని సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి అవసరమైన మార్గాలను సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని, విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేదిలేదన్నారు. మండల సమావేశానికి గైర్హాజరైన అధికారులకు నోటీసులు జారీచేసి వివరణ తీసుకోవాలని, సంతృప్తికరంగా లేకపోతే చర్యలకు సిఫారసు చేయాలని సూచించారు. మండల సమావేశంలో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో చాలా వరకు సమస్యలు పరిష్కారానికి మార్గాలు దొరుకుతాయన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని, ప్రత్యేక అధికారులు సైతం వారంలో రెండురోజులు తప్పకుండా వారికి కేటాయించిన గ్రామాల్లో పర్యటించాలని ఆదేశించారు.

– సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న జీఓ 69పై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. డీపీఆర్‌లో స్వల్ప మార్పులు చేస్తే కోటకొండ, బండగొండ, తిర్మలాపూర్, అభంగాపూర్, బొమ్మన్‌పాడు, అమ్మిరెడ్డిపల్లి, అప్పిరెడ్డిపల్లి తదితర గ్రామాలు సస్యశ్యామలం అవుతాయని ఎమ్మెల్యేకు సూచించారు. అనంతరం మండల ప్రాదేశిక సభ్యులకు చివరి సమావేశం కావడంతో అందరికి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అంజలి, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహారెడ్డి, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యులు తాజోద్దీన్, తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్, ఇన్‌చార్జి ఎంపీడీఓ బాలాజీ, సూపరింటెండెంట్ శోభారాణి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణం కోసం వినతి..

నారాయణపేట: జిల్లా కేంద్రం సమీపంలోని వల్లంపల్లి వద్ద శబరి పీఠం సన్నిధానంలో అయ్యప్ప భక్తులు దీక్ష కాలంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు మరుగుదొడ్ల నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని శనివారం ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డికి సీవీ ఆర్ భవనంలో అయ్యప్ప మాలధారులు వినతి పత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే మరుగు దొడ్ల నిర్మాణంకోసం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు కాకర్ల భీమయ్య, జెంగిడి వెంకటేష్, తిప్పన్న, మల్లేష్, బాలాజీ, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- జిల్లా కేంద్రం సమీపంలోని సింగారం చౌరస్తాలో శ్రీ బసవేశ్వర విగ్రహ ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బసవేశ్వర విగ్రహ ఏర్పాటుకు స్థల కేటాయింపు వీలైనంత త్వరగా ఇవ్వాలని ఎమ్మెల్యేకు వినతిలో కోరగా ఎమ్మెల్యే అందుకు సానుకూలంగా స్పందించారు. వినతిపత్రం అందజేసిన వారిలో జిల్లా అధ్యక్షుడు ఆవుటి రవికుమార్, గందె రవికాంత్, అరకంచి రవి కుమార్, ఉల్వూర్ రఘుబాబు, డాక్టర్ సచిన్ మంగలిగి, బుక్కరాజు, అక్కమహాదేవి మహిళా సంఘం సభ్యులు మల్లికార్జునమ్మ, మంజుల, నిర్మల, రాజేశ్వరి ఉన్నారు.

మండల అభివృద్ధికి కృషి..



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

నర్వ: మండల అభివృద్ధికి తమ శాయాశక్తుల శక్తి వంచన లేకుండా కృషిచేశామని ఎంపీపీ జయరాములుశెట్టి, జెడ్పీటీసీ గౌనిజ్యోతి అన్నారు. శనివారం ఎంపీపీ జయరాములుశెట్టి అధ్యక్షతన మండల సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు నెలలుగా మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రత్యేక అధికారుల పాలనలోని ప్రధాన సమస్యలను ఎంపీటీసీ సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు.. తాగునీటి, విద్యుత్, పశువైద్యం, వైద్యం, వ్యవసాయం, పంచాయతీరాజ్‌లోని సమస్యలపై ఆయా శాఖల అధికారులు సభలో నివేదికలను చదివి వినిపించారు. అనంతరం చివరి సమావేశంలో ఈ ఐదేళ్ల కాలంలో మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందించిన సేవలపై ప్రజాప్రతినిధులు నెమరువేసుకున్నారు. అనంతరం ఎంపీపీ, జెట్పీటీసీ, ఎంపీటీసీలను అధికారులు, ఆయా గ్రామాల నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ మల్లారెడ్డి, ఎంపీఓ సుదర్శన్, వైస్ ఎంపీపీ వీణావతి, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం



మాట్లాడుతున్న చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నర్వ: తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేసేందుకు రైతుభరోసాను చేపట్టనుందని పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం పీఏసీఎస్ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో ఆయన రైతులనుద్దేశించి మాట్లాడారు.. ఆయా గ్రామాల రైతులు రైతుభరోసాపై తమ సలహాలు, సూచనలు అందించారు. కొంతమంది రైతులు రైతుభరోసాను పది ఎకరాల వరకు అందించాలని కోరగా, మరికొంతమంది 20ఎకరాల వరకు అందిస్తూ, రైతు భరోసా ద్వారా ఎరువులు అందించాలని సూచించారు. సాగు చేస్తున్న రైతుకు తప్పకుండా రైతుభరోసాను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు తమ సలహాలు, సూచనలను సభలో తెలిపారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మన్న, సీఈఓ ఉదయ్‌కుమార్, డైరెక్టర్‌లు, శ్రీనివాస్‌రెడ్డి, రామేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

డాక్టరేట్ సాధించిన పేట విద్యార్థిని



నారాయణపేట: జిల్లా కేంద్రంలోని మార్కెట్ ఏరియాకు చెందిన దివంగత న్యాయవాది మద్దూరు బస్వరాజు కుమార్తె స్వాతి డాక్టరేట్ సాధించారు. హైదరాబాద్ ఉస్మానియా యునివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ శివరాజ్ వద్ద కెమిస్ట్రీ విభాగంలో డాక్టరేట్‌పై ప్రావీణ్యత సాధించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈమేరకు పలువురు అభినందించారు.

సమయపాలన పాటించాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న ఏఎంఓ విద్యాసాగర్

నర్వ: ఉపాధ్యాయులు తప్పనిసరి సమయపాలన పాటించాలని ఏఎంఓ విద్యాసాగర్ అన్నారు. శనివారం మధ్యాహ్నం పాథర్చేడ్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులు హాజరుపట్టికను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు తీసుకోవాల్సిన అంశాలను ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల హాజరుశాతం పెంచాలని, మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని సూచించారు. ఉపాధ్యాయులు, హెచ్ఎం నరేష్ తదితరులు ఉన్నారు.

పదోన్నతి బాధ్యత పెంచుతోంది..



నారాయణపేట: పోలీస్ శాఖలో పదోన్నతి ఉత్సాహంతో పాటు మరింత బాధ్యత పెంచుతోందని ఎస్పీ యోగేష్ గౌతం అన్నారు. జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న యాదయ్య ఎఆర్‌ఎస్‌ఐగా ప్రమోషన్ పొందిన సందర్భంగా ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఎఆర్‌ఎస్‌ఐ ర్యాంక్ వన్‌స్టార్‌ను ఆయనకు ఎస్పీ తొడిగి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీఐ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలి

నారాయణపేట: రోడ్డు పనులు నేపంతో మండలంలోని కోటకొండ బస్సులను నెలరోజుల నుంచి రద్దుచేసి ప్రజలు, విద్యార్థులను ఆర్టీసీ అధికారులు ఇబ్బందులు పెట్టడం సరికాదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్సులు రద్దు చేయడంతో మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సులు నడిపి ప్రజలు, విద్యార్థుల ఇబ్బందులు తీర్చాలని డిమాండ్ చేశారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



మక్తల్‌లో సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



కృష్ణాలో..

మాగనూర్: మక్తల్ మండలంలోని సంగంబండ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన రాజీరెడ్డి ప్రమోషన్‌పై స్థానిక ప్రాథమిక పాఠశాలకు బదిలీపై రావడంతో శనివారం ఇన్‌చార్జి హెచ్ఎం స్వప్న ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు. హెచ్ఎం రాజీరెడ్డి మాట్లాడుతూ.. ప్రమోషన్లలో భాగంగా మాగనూర్ ప్రాథమిక పాఠశాలకు రావడం చాలా సంతోషంగా ఉందని, తోటి ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వప్న, విశాలాక్షి, శశిరేఖ పాల్గొన్నారు.

మక్తల్: ఇన్‌చార్జి ఎంఈఓ వెంకటయ్య పదవి రమణ పొందుతున్న సందర్భంగా శనివారం ఎఆర్ఎం ఫంక్షన్ హాల్‌లో ఆయనకు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఊట్కూర్, మక్తల్ రెండు మండలాలకు ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టారు. ఆయన రెండు మండలాలకు సేవలను కొనసాగించారు. కార్యక్రమంలో జీహెచ్ఎం అనిల్‌గౌడ్, నర్సిరెడ్డి, వెంకట్‌రాములు, శ్రీనివాస్‌రెడ్డి, పరందారాములు తదితరులు పాల్గొన్నారు.

- మండలంలోని కర్ని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు పిజికల్ డైరెక్టర్‌గా బి.రూప పదొన్నతిపై రావడంతో పాఠశాల జీహెచ్ఎం వెంకటయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయులు, విశ్రాంత పీఈటీ గోపాలం కలిసి శాలువాతో సన్మానం చేశారు.

మక్తల్(ఊట్కూరు): విద్యాబుద్ధులు నేర్పిన గురువు బదిలీపై వెళ్తుండగా పుట్టెడు దుఃఖంతో విద్యార్థులు వీడ్కోలు పలికిన సంఘటన మండలంలోని మల్లెపల్లి పాఠశాలలో చోటుచేసుకుంది. మల్లెపల్లి పాఠశాలలో ఐదేండ్లుగా నర్సింగప్ప అనే ఉపాధ్యాయుడు హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం హెచ్ఎంగా పెద్దపొర్ల పాఠశాలకు బదిలీపై వెళ్తున్న ఆయనకు ఉపాధ్యాయులు, గ్రామస్తులు సన్మానించారు. విద్యార్థులు ఎడవడంతో పాఠశాలకు వచ్చిన వారంతా సంఘటన చూసి వారు సైతం కన్నీటి పర్యంతమయ్యారు.

కృష్ణా: మండలంలోని కున్సి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సురేందర్ శనివారం పదవి విరమణ పొందడంతో ఆయనను ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ సోమశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ.. పాఠశాలను అన్నిరకాలుగా అభివృద్ధి పరిచారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు నల్లె నర్సప్ప, కుర్వ బాల్‌రాజ్ పాల్గొన్నారు.



మక్తల్‌లో ..

విద్యార్థినికి కలెక్టర్ అభినందన



కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న అక్షిత

మద్దూరు: మండలంలోని పెదిరిపాడ్ కస్తుర్బాగాంధీ పాఠశాలలో చదివి పదోతరగతిలో 9.5 జీపీఏ సాధించిన అక్షితను కలెక్టర్ సిక్తా పట్నాయక్ అభినందించారు. శనివారం జిల్లా కేంద్రంలో బాలిక చదువులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో విలేజిస్ ఇన్‌పార్టనర్ షిప్ సంస్థ వారు ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహంతోపాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. మండలంలోని ఎక్కమేడ్ గ్రామానికి చెందిన అక్షిత పదోతరగతి మండల స్థాయిలో రెండో స్థానంలో నిల్వడంతో కలెక్టర్ చేతుల మీదుగా రూ. 20 వేల నగదు, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ అబ్దుల్ ఘనీ, వీఐసీ సంస్థ ప్రతినిధులు, కేజీబీవీ ప్రిన్సిపాల్ గౌరమ్మ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మరికల్‌లో మాట్లాడుతున్న ఆర్ఐ శ్రీశైలం

మరికల్: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆర్ఐ శ్రీశైలం, ఏఎస్ఐ శంకరయ్య అన్నారు. శనివారం మండలంలోని సివిల్ రైట్ డై సందర్భంగా గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పల్లెలో ముఖ్యంగా హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతి ఇంకా ఉందని, దాని నిర్మించాల్సింది ఎంతైనా ఉందన్నారు. అలాగే కులాల పేరుతో దూషించుకోకుండా కలిసిమెలిసి ఉండాలని గ్రామస్తులకు సూచించారు.

మక్తల్: గ్రామాల్లో ప్రజలు సోదర భావంతో ఉండాలని ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మంతన్‌గోడ్‌లో సివిల్ రైట్ డై సందర్భంగా గ్రామ సభను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కులాల పేరుతో దూషించుకోకుండా కలిసిమెలిసి ఉండాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ విజయకుమార్, దశరథ్, ఆశన్న, సుదర్శన్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల తనిఖీ

వాహనదారులు నంబర్ ప్లేట్‌లేని వాటికి నంబర్లు వేయించుకోవాలని ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని నంబర్‌ప్లేట్ లేని వాహనాలను తనిఖీచేసి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించి వాహనాలు నడపాలన్నారు. అతివేగంగా పోకుండా జాగ్రత్తగా పాటించాలని కోరారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి, పోలీసులు నరేష్, భాను, మోహన్‌రెడ్డి, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి సామాజిక తనిఖీపై అవగాహన



ఉపాధి సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అధికారులు

మద్దూరు: ఉమ్మడి మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పనులుపై సామాజిక తనిఖీపై ఉపాధి సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి టీఏలు, ఎఫ్ఏలకు, సోషల్ ఆడిట్ సిబ్బంది, డీఆర్‌పీలకు, అవగాహన కార్యక్రమాన్ని ఎంపీడీఓ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ఈ మేరకు.. ఏడాదిలో గ్రామాల్లో చేసినా ప్రతి పనికి సంబంధించిన మస్టర్లు, తదితర వివరాలను సోషల్ ఆడిట్ సిబ్బందికి అందజేయాలని ఎంపీడీఓ జయరాములు ఉపాధి సిబ్బందికి ఆదేశించారు. సోషల్ ఆడిటర్లకు ఉపాధి సిబ్బంది సహకరించాలని అంబుమడ్ నాగిరెడ్డి సూచించారు. ఈ ఆర్థిక సంవత్సంలో ఏ రోజునుంచి ఏ రోజు వరకు ఎన్ని కోట్ల పనులకు సోషల్ ఆడిట్ నిర్వహిస్తామనే తెలుపుతామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రామన్న, ఏపీఓ సిద్ధేశ్వర్, ఏపీఓ ఎస్ఆర్‌పీ బద్రునాయక్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మండల స్థాయి కమిటీ సమావేశంలో అధికారులు

మద్దూరు: వర్షకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ జయరాములు, తహసీల్దార్ మహేష్‌గౌడ్ వివిధ శాఖల అధికారులకు సూచించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో వైద్య, విద్యా, పంచాయతీరాజ్, అధికారులకు మండలస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులతోపాటు, నీరు నిల్వ ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే పాఠశాల విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడ ఏ సమస్య వచ్చిన వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని వైద్యాధికారిణి మమత తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీఓ రామన్న, వివిధ పాఠశాల హెచ్ఎంలు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ



పాఠ్యపుస్తకాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ మద్దిలేటి

నారాయణపేట రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న ఇంటర్ విద్యార్థులకు శనివారం పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ పషీద్ మాట్లాడుతూ.. టెన్త్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు తప్పకుండా ప్రభుత్వ కళాశాలలోనే చదువుకునేందుకు రావాలని, ఉచితంగా విద్యాబోధనతో పాటు పాఠ్యస్తకాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకట్రాములు, రవిందర్‌రెడ్డి, సంధ్య, అరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు శనివారం కళాశాల ప్రిన్సిపాల్ మద్దిలేటి ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. మొదటి సంవత్సర విద్యార్థులకు వంద మంది, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు వందమందికి ఉచిత పాఠ్యపుస్తకాలను అందజేసినట్లు ఆయన తెలిపారు. నాణ్యమైన ఉచిత విద్యాబోధన తమ కళాశాలలో అందుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రాములు, రాజేష్, శ్రీనురెడ్డి, విజయ్‌కాంత్, రమేష్, లక్ష్మిరెడ్డి, శాంతు నాయక్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి ఐరన్ మాత్రలు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

మక్తల్ (ఊట్కూరు): ప్రతి విద్యార్థి ఐరన్ మాత్రలు తప్పనిసరిగా వేసుకునే విధంగా ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని ఎంపీడీఓ ధనుంజయగౌడ్ అన్నారు. శనివారం మండలంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కలెక్టర్ సిక్తా పటానాయక్ ఆదేశాల మేరకు మండలస్థాయి వైద్య కమిటీ సమావేశం డాక్టర్ భవాని అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఐరన్‌పోలిక్ యాసిడ్ మాత్రలు ప్రతి గురువారం విద్యార్థులకు వేయించాలన్నారు. 10 నుంచి 15 సంవత్సారాల వారికి ఒక మాత్ర ఇవ్వాలని, 52వారాలపాటు ప్రతి గురువారం మాత్ర ఇచ్చేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రల ద్వారా విద్యార్థులను రక్తహీనత నుంచి కాపాడిన వారమవుతామని తెలిపారు. ఈ మాత్రలపై ప్రతి విద్యార్థికి అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఎంపీఓ రాజు, వైద్య సిబ్బంది విజయ్‌కుమార్, నర్సింహులు పాల్గొన్నారు.

డీఆర్డీఏ పీడీకి వినతి

నారాయణపేట: ఉపాధిహామీ పథకంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న సీనియర్ మేటిలను ఫీల్డ్ అసిస్టెంట్లుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం డీఆర్‌డీఏ పీడీ రాజేశ్వరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు లేని గ్రామాల్లో సీనియర్ మీటిలే ఉపాధి పథకాన్ని నడిపిస్తున్నారన్నారు. కూలీలను పనికి తీసుకురావడం, వారికి పేమెంట్ చేయించడంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ మేటీలకు కనీస వేతనం ఉద్యోగ, భద్రత లేదని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా 150మంది సీనియర్ మేటీలు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ మేటిల యూనియన్ జిల్లా నాయకులు విజయ్, నరేష్, నాగరాజు నర్సింహ, మంగమ్మ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మొక్కలు నాటుదాం

మక్తల్ (ఊట్కూరు): ఇంటి ఆవరణలో మొక్కలు నాటి పరిరక్షిద్దామని హెచ్ఎం లక్ష్మారెడ్డి అన్నారు. నిడుగుర్తి పాఠశాలలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఇంటి పరిసరాలు, ఖాళీ స్థలంలో ఐదు మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హిందిపడిత్ శ్రీనివాస్, నర్సింహ, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.